నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**దక్షిణ మధ్య రైల్వేకు అవార్డులు**

సివిల్ ఇంజినీరింగ్ విభాగం, నిర్మాణానికి సంబంధించి రెండు విభాగాల్లో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) రెండు 'పెర్ఫామెన్స్ ఎఫిషియన్సీ షీల్డ్- 2023' అవార్డులు సాధించింది. ఈ అవార్డులను డిసెంబర్ 15న ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అందజేశారు.

nipuna
Every Wednesday Free Supplement

03.
10 జనవరి 2024
పేజీలు 8

# ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు- వాదనలు

**తల్లికి పిల్లలందరూ సమానమే అయినప్పటికీ బలహీనంగా ఉన్న బిడ్డపై కాస్త ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. రాజ్యం విషయంలోనూ ఇదే విచక్షణ వర్తిస్తుంది. అందుకే భారతదేశ సమాఖ్యను అసౌష్టవ సమాఖ్య (Asymmetric Federalism)గా తీర్చిదిద్దారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులున్న రాష్ట్రాలకు కొన్ని ప్రత్యేక వెసులుబాటులు కల్పించారు. ఈ క్రమంలో కశ్మీర్ విలీన సందర్భంలో అప్పటి ప్రత్యేక పరిస్థితుల్లో ఆ రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక వెసులుబాటులను రాజ్యాంగంలోని ప్రకరణ 370 ప్రకారం అందించారు.**




## నేపథ్యం

- దేశ విభజన సమయంలో కశ్మీర్ మహారాజు హరిసింగ్ అటు పాకిస్థాన్‌లో గాని, ఇటు భారత్‌లో గాని విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండటానికే మొగ్గు చూపారు. పాకిస్థాన్ ప్రేరిపిత గిరిజనులు పాక్ సైన్య సహకారంతో కశ్మీర్ ఆక్రమణకు వస్తుండటంతో హరిసింగ్ భారత సహాయాన్ని అర్థించారు.
- ఒడంబడికలో భాగంగా కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయడానికి ఒప్పుకొన్నాడు. కొన్ని ప్రత్యేక హక్కులకు సంబంధించిన షరతులతో విలీన ఒప్పందం (Instrument of Accession)పై 1947, అక్టోబర్ 26న సంతకం చేశాడు.
- విలీన ఒప్పందం ప్రకారం జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పిస్తూ రాజ్యాంగ ప్రకరణ 370ని 1949లో రాజ్యాంగంలో చేర్చారు. 1954లో రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఆర్టికల్ 370 అమల్లోకి వచ్చింది. జమ్మూకశ్మీర్‌లో శాశ్వత నివాసుల హక్కుల విషయంలో ఆ రాష్ట్ర శాసనసభ చట్టాలు చేసుకోవడానికి అనువుగా ప్రకరణ 35(ఎ)ను రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా రాజ్యాంగంలో చేర్చారు.
- 1957లో రాజ్యాంగ రచన పూర్తయ్యాక జమ్మూకశ్మీర్ రాజ్యాంగ పరిషత్ రద్దయ్యింది. 1958, జనవరి 26 నుంచి జమ్మూకశ్మీర్ రాష్ట్ర రాజ్యాంగ పరిషత్తు రూపొందించిన ఆ రాష్ట్ర ప్రత్యేక రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

**ప్రకరణ 370, 35(ఎ) కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు**

ప్రకరణ 370 ప్రకారం..

- జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా (Special Status) లభిస్తుంది.
- ప్రత్యేక రాజ్యాంగం, పతాకం, గీతం ఉంటాయి.
- భారత సార్వభౌమాధికారం విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు, రక్షణపరమైన అంశాలకే పరిమితం. ఇతర అంశాలపై జమ్మూకశ్మీర్ రాష్ట్రానికే పూర్తి స్వయం నిర్ణయాధికారం/స్వయం ప్రతిపత్తి ఉంటుంది.
- రక్షణ, విదేశాంగ అంశాలు, కమ్యూనికేషన్లు సంబంధిత చట్టాలు మినహా పార్లమెంట్ ద్వారా రూపొందే ఇతర చట్టాలు జమ్మూకశ్మీర్‌కు వర్తించాలంటే ఆ రాష్ట్ర శాసన సభ ఆమోదం అవసరం. 1957 వరకు జమ్మూకశ్మీర్ రాజ్యాంగ పరిషత్తు ఆమోదం కావాల్సి ఉండేది.
- జమ్మూకశ్మీర్‌లో ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదు.
- ప్రకరణ 370ని సవరించే, రద్దుపరిచే అధికారాలు జమ్మూకశ్మీర్ రాజ్యాంగ పరిషత్తుకు మాత్రమే ఉంటాయి.

## ప్రకరణ 35(ఎ) ప్రకారం..

- ఈ ప్రకరణ జమ్మూకశ్మీర్ ప్రాంతంలో శాశ్వత నివాసాలు (Permanent Residents)/స్థానికులు ఎవరో నిర్వచించే అధికారం ఆ రాష్ట్ర శాసన సభకు కల్పించింది.
- ఈ విధంగా ఆ రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర, దేశ పౌరసత్వం (ద్వంద్వ పౌరసత్వం) ఉంటుంది.
- ఈ ప్రకరణ ప్రకారం రాష్ట్రేతరులకు ఈ రాష్ట్రంలో ఉద్యోగాలు పొందే, ఆస్తులు సమకూర్చుకునే హక్కులు నిరాకరించారు. కేవలం ఆ ప్రాంత శాశ్వత నివాసులకే ఆ హక్కులు కల్పించారు.
- జమ్మూకశ్మీర్‌కు చెందిన స్త్రీ, రాష్ట్రేతరుడిని వివాహం చేసుకుంటే ఆమెకు, ఆమె వారసులకు కూడా శాశ్వత నివాసాల హోదా ఉండదు.
- ఈ విధంగా ప్రకరణ 370, 35(ఎ) వల్ల జమ్మూకశ్మీర్‌లో పౌరసత్వం, ఆస్తి యాజమాన్య హక్కులు, ప్రాథమిక హక్కులు మిగతా రాష్ట్రాలతో పోలిస్తే వేరుగా ఉంటాయి.
- జమ్మూకశ్మీర్ విలక్షణ సంస్కృతిని కాపాడటానికి, నెమ్మదిగా భారత్‌లోని ఇతర రాష్ట్రాలతో సమాన స్థాయికి తీసుకొని రావడానికి ప్రకరణ 370, 35(ఎ) ద్వారా ప్రత్యేక రాజ్యాంగం, జెండా, అంతర్గత అంశాల్లో నిర్ణయాధికారాలు ఇచ్చారు. క్రమంగా ఈ అంశాలు వేర్పాటువాద భావజాలం వ్యాప్తి చెందడానికి తోడ్పడ్డాయి. దానిలో భాగంగా జాతి విద్వేషాలు పెరిగి కశ్మీరీ పండిట్లపై దురాగతాలకు కారణమయ్యాయి. వారు తమ ప్రాంతాన్ని విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.
- పాక్ ప్రేరిత ఉగ్రవాదం జమ్మూకశ్మీర్‌లో ప్రబల దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి ముప్పుగా పరిణమించింది.
- భూ యాజమాన్య హక్కులు తదితర అవరోధాల వల్ల మొదటి నుంచి ఈ ప్రాంతానికి బయటి నుంచి పెట్టుబడులు, వ్యాపారులు రావడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆర్థిక అభివృద్ధి కుంటుపడింది.
- పార్లమెంట్ చేసిన చట్టాలు నేరుగా వర్తించకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు అనేక సౌలభ్యాలు, హక్కులు పొందలేకపోతున్నారు. ఉదా: విద్యాహక్కు, సమాచార హక్కు వంటి హక్కులను కల్పించే జాతీయ చట్టాలను జమ్మూకశ్మీర్ రాష్ట్రం స్వీకరించకపోవడం వల్ల అక్కడి ప్రజలకు మిగతా దేశ ప్రజలు పొందుతున్న ఈ హక్కులు దక్కడం లేదు.
- మహిళలు రాష్ట్రేతరులను వివాహం చేసుకున్నప్పుడు తమ రాష్ట్ర స్థానికతను కోల్పోవడం, అక్కడి ఆస్తి యాజమాన్య హక్కులను కోల్పోవడం వంటి వివక్షకు గురయ్యారు. పరిపాలనాపర లోపాల వల్ల జమ్మూ, లడఖ్ వంటి ప్రాంతాలు వెనుకబడుతున్నాయి.
- ఈ నేపథ్యంలో 2018, డిసెంబర్‌లో అప్పటి రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు చేయలేని రాజకీయ పరిస్థితుల్లో గవర్నర్ పాలన విధించి 6 నెలలు పూర్తికావడంతో రాష్ట్రపతి పాలన ప్రారంభమైంది (జమ్మూకశ్మీర్ రాజ్యాంగం ప్రకారం ఈ ప్రక్రియ జరిగింది).
- రాష్ట్రపతి రాజ్యాంగ ప్రకరణ 356(1)(బి) ప్రకారం, రాష్ట్రపతి పాలనలో ఉన్న రాష్ట్ర శాసన సభ తరఫున చట్టాలు చేసే అధికారాన్ని పార్లమెంటుకు దత్తం చేశారు. ఈ విధంగా జమ్మూకశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీకి ఉన్న అధికారాలు పార్లమెంటుకు ఇచ్చారు.
- ప్రకరణ 370(1) ప్రకారం జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన ప్రభుత్వ వ్యవహారాల పరంగా కొన్ని అంశాల వర్తింపు విషయమై భాష్యం చెప్పే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఈ ప్రకరణ ఆధారంగా రాష్ట్రపతి ప్రకరణ 367ను సవరిస్తూ ఒక ఆర్డర్‌ను జారీ చేశారు (ప్రకరణ 367లో కొన్ని రాజ్యాంగ అంశాలను ఏ విధంగా అర్థం చేసుకోవాలో, వ్యక్తీకరించాలో (Read and Interpret) సూచనలు చేశారు).
- ఈ రాష్ట్రపతి ఆర్డర్ ప్రకారం ప్రకరణ 370(3)లో పేర్కొన్న జమ్మూకశ్మీర్ రాష్ట్ర రాజ్యాంగ పరిషత్‌ను, జమ్మూకశ్మీర్ రాష్ట్ర శాసన సభగా భావించాలని సవరణ చేశారు (ప్రకరణ 370(3) ప్రకారం ప్రకరణ 370ని రద్దు లేదా సవరణ చేయాలంటే జమ్మూకశ్మీర్ రాజ్యాంగ పరిషత్ ఆమోదం తప్పనిసరి).

## 370 రద్దును వ్యతిరేకిస్తున్నవారి వాదన

- రాష్ట్రపతి ఆర్డర్‌లో ప్రకరణ 370(3)లో రాజ్యాంగ పరిషత్ ఆమోదం స్థానంలో రాష్ట్ర శాసన సభ ఆమోదం అని చేర్చారు. దీంతో ప్రకరణ 370ని సవరించాలంటే రాష్ట్ర శాసన సభ ఆమోదం సరిపోతుంది.
- రాష్ట్ర శాసన సభ ఉనికిలో లేనపుడు రాష్ట్రపతి పాలన సందర్భంలో పార్లమెంటుకు రాష్ట్ర శాసన సభ అధికారాలు లభిస్తాయి. కాబట్టి ప్రకరణ 370ని రద్దు చేసే అధికారం కూడా పార్లమెంటుకు వస్తుందనే తర్కంతోను, 2015లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆర్టికల్ 370ని రద్దు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని ఇచ్చిన తీర్పు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 2019, ఆగస్టు 5న ప్రకరణ 370ని రద్దు చేసింది. అదేవిధంగా జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా తొలగించి జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేస్తూ 'జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019'ను పార్లమెంట్ 2019, ఆగస్టు 9న ఆమోదించింది. తద్వారా జమ్మూకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక మినహాయింపులన్నీ రద్దయ్యి, రాజ్యాంగం వర్తింపులోకి వచ్చింది.
- ప్రకరణ 370ని సవరించే, రద్దు చేసే అధికారం జమ్మూకశ్మీర్ రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే ఉందని, అది 1957లో రద్దవడంతో ప్రకరణ 370 రాజ్యాంగంలో భాగమైందని, అందువల్ల ప్రకరణ 370ని రద్దు చేసే అధికారం కేంద్రానికి లేదని సుప్రీంకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి.
- ప్రకరణ 367ను సవరిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డర్ చెల్లదు. ఆర్టికల్ 370 రద్దు చేయడం కోసం ప్రకరణ 367ని సవరిస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీ అయ్యాయి. ఏదైనా విషయానికి సంబంధించి ప్రత్యక్షంగా అనుమతి నిరాకరించినపుడు దాన్ని పరోక్షంగా చేయడానికి ప్రయత్నించరాదని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ప్రకటించింది. ఈ అత్యున్నత న్యాయస్థాన ప్రవచన పరంగా చూసినా ఆర్టికల్ 370 రద్దు చేసిన విధానం చెల్లదు.
- ప్రజా ప్రతినిధుల సభకు ఉన్న అధికారాలు నామినేటెడ్ గవర్నర్లకు, పరోక్షంగా ఎన్నికైన రాష్ట్రపతికి ప్రత్యేక పరిస్థితుల్లో తాత్కాలికంగా మాత్రమే సంక్రమిస్తాయి. రాష్ట్ర స్థితిగతులను పాలనారీతులను మార్చే శాశ్వత ప్రభావం గల అంశాలపై నిర్ణయాధికారం ప్రజా ప్రతినిధుల సభకే ఉండాలి. ఒకవేళ అది మనుగడలో లేకుండా తిరిగి మనుగడలోకి వచ్చిన తర్వాత శాశ్వత నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రపతి, గవర్నర్ల ఆదేశాలు తాత్కాలికం మాత్రమే. తాత్కాలిక అధికారాలను అడ్డుపెట్టుకొని శాశ్వత నిర్ణయాలు తీసుకోరాదు. ఇది కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి దారితీస్తుంది. దొడ్డిదారిన చట్టాలు తీసుకొచ్చే అరాచక విధానాలను అడ్డుకోకుంటే రాజ్యాంగ వక్రీకరణ ప్రారంభమవుతుంది.
- రాజ్యాంగ పరిషత్‌ను, రాష్ట్ర శాసన సభను ఒకే గాటన కట్టలేం. రాజ్యాంగ పరిషత్ ప్రజల ఆశయాల మేరకు రాజ్యాంగ రచన చేపడుతుంది. ఆ రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రక్రియ శాసన వ్యవస్థ చేపడుతుంది. అంతేకాని రాష్ట్ర శాసన వ్యవస్థ కొత్త రాజ్యాంగాన్ని రచించే సార్వభౌమాధికారం చెలాయించడం భారత రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతానికి వ్యతిరేకం.
- రాష్ట్రపతి ఆదేశం ద్వారా రాష్ట్ర శాసన సభకు ఆర్టికల్ 370 రద్దును ఆమోదించే అధికారం కల్పించారు. జమ్మూకశ్మీర్ రాజ్యాంగంలోని ప్రకరణ 147 ప్రకారం జమ్మూకశ్మీర్ రాజ్యాంగానికి సంబంధించిన ఏ మార్పులైనా జమ్మూకశ్మీర్ శాసన సభలో 2/3వ వంతు మెజారిటీతో ఆమోదించాలి. ఈ ప్రకరణ ప్రకారం జమ్మూకశ్మీర్ రాజ్యాంగం రద్దు చట్టబద్ధం కాదు.
- ఈ విధమైన వాదనలతో దాఖలైన వ్యాజ్యాలపై విచారణ నిమిత్తం సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. మొత్తం 23 పిటిషన్లపై ధర్మాసనం విచారణ జరిపి డిసెంబర్ 11న ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ తీర్పు ప్రకటించింది. ఈ తీర్పులో రద్దుకు ఉన్న రాజ్యాంగబద్ధత, రద్దు అనంతర కర్తవ్యం వంటి విషయాలపై కీలక అంశాలు సుప్రీంకోర్టు ధర్మాసనం చర్చించింది.

మిగతా 5వ పేజీలో...

## సుప్రీంకోర్టు తీర్పులో చర్చించిన అంశాలు

- జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి రాజ్యాంగ పరిషత్ మనుగడలో లేనపుడు ప్రకరణ 370ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉందని ప్రకటించింది. రాజ్యాంగ పరిషత్ మనుగడలో లేదు కాబట్టి ప్రకరణ 370 రాజ్యాంగంలో అంతర్భాగం అయిపోయిందనడం సరికాదు. అప్పుడు ఆర్టికల్ 370(3) ద్వారా ఇచ్చిన అధికారాలు వృథా అయినట్టే.
- అదేవిధంగా ప్రకరణ 370 ఒక తాత్కాలిక ఏర్పాటు. దాన్ని అప్పటి రాష్ట్రంలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, రాష్ట్రంలో రాజ్యాంగ పరిషత్ ఏర్పడి రాజ్యాంగ రచన పూర్తి చేసేవరకు అవసరార్థం ఏర్పరిచారు. కాబట్టి అది నిస్సందేహంగా తాత్కాలిక ఏర్పాటే. ఆర్టికల్ 370కి అనుబంధం అయిన ప్రకరణ 35(ఎ) విషయాల్లోను ఇదే వర్తిస్తుంది. కాబట్టి రద్దు సమంజసమే.
- దేశంలో కొన్ని రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా అసౌష్టవ సమాఖ్య విధానం అవలంబిస్తూ, ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి వాటికి ప్రత్యేకమైన వెసులుబాట్లు కల్పిస్తారు. దాన్ని అంతర్గత సార్వభౌమాధికారంగా భావించరాదు. జమ్మూకశ్మీర్ ప్రకరణ 370 ద్వారా ఆ అధికారాన్ని ఆశిస్తే ప్రకరణ 371(ఎ) నుంచి 371(జె) వరకు వివిధ రాష్ట్రాలకు కల్పించిన ప్రత్యేక వెసులుబాట్ల ఆధారంగా ఆయా రాష్ట్రాలు కూడా అంతర్గత సార్వభౌమాధికారాన్ని అడుగుతాయి.

మల్లవరపు
బాలలత
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ
హైదరాబాద్

